సారు సెలవు పెడితే..బడికి తాళమే!

- విద్యార్థులు చదువుకు దూరం
- టీచర్లు రాకపోవడంతో మైదానంలో ఆటలు
- ఏకోపాధ్యాయ పాఠశాలల్లో దుస్థితి

నేరడిగొండ: ఏకోపాధ్యాయ పాఠశాలల్లో బోధన గగనంగా మారింది. సారూ సెలవు పెడితే.. ఇక బడికి తాళం వేయాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయి. దీంతో విద్యార్థులు చదువులకు దూరం కావల్సి వస్తోంది. నేరడిగొండ మండలంలోని చాలా పాఠశాలల్లో ఉపాధ్యాయుడు సెలవు పెడితే ఇక విద్యార్థులకు సెలవే అన్నట్టుగా మారింది. పిల్లలు అక్షరాలు నేర్చుకోవడం దేవుడెరుగు కానీ.. మైదానంలో ఆటలాడుతూ కనిపిస్తారు. ఈ దృశ్యాలు మండలంలోని ఏకోపాధ్యాయ బడుల్లో దర్శనమిస్తున్నాయి. ఎక్కువ సంఖ్యలో విద్యార్థులున్నా బోధించేందుకు మాత్రం ఒక్కడే ఉపాధ్యాయుడు ఉండటం, ఏదో కారణంతో ఆ సారూ బడికి రాకుంటే పిల్లలు ఆ రోజు కాలక్షేపం చేస్తూ కనిపిస్తారు. మండల వ్యాప్తంగా 45 పాఠశాలల్లో ఏకోపాధ్యాయులు ఉన్నారు. అయితే బడుల్లో విద్యార్థులు అంతంత మాత్రంగానే సాగుతున్నట్లు తెలుస్తోంది.

ప్రాథమిక పాఠశాలల్లో సమస్య జఠిలం

ప్రభుత్వం ఉపాధ్యాయుల కేటాయింపు ప్రక్రియను 2022 జనవరిలో కేడర్ల వారీగా చేపట్టింది. కొందరు ఆయా కారణాలతో సెలవు పెట్టడం, మరికొందరు పోటీ పరీక్షల నేపథ్యంలో రాకపోవడంతో విద్యార్థులకు పాఠాలు బోధించేవారు లేకుండా పోతున్నారు. మరోపక్క ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు లేక పోవడంతో నియామక ప్రక్రియ నిలిచిపోయింది. ప్రభుత్వం ఉపాధ్యాయుల సర్దుబాటు పేరుతో విద్యావలంటీర్లను నియమించడం లేదు. దీని ప్రభావం విద్యార్థుల చదువులపై పడుతోంది. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లోనే ఈ సమస్య జఠిలంగా మారింది.


వడూర్ ప్రాథమికోన్నత ఉర్దూ పాఠశాలలో విద్యార్థులకు బోధిస్తున్న ఏకోపాధ్యాయురాలు

అన్ని సబ్జెక్టులు బోధించడం అసాధ్యం..

ఉపాధ్యాయులు ఉన్నచోటనే చదువులు అంతంత మాత్రంగా సాగుతున్న ఈ తరుణంలో ఇక ఒక్కరే ఉన్నచోటా ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. 1 నుంచి 5 తరగతుల వరకు 18 సబ్జెక్టులు ఉన్నాయి. ఒక్కరే అవన్నీ బోధించడం అసాధ్యం. దీనికితోడు బడి నిర్వహణకు సంబంధించిన సమావేశాలకు హాజరుకావాల్సి ఉంటుంది. ఏదైనా కారణంతో సెలవు పెడితే ఆ రోజు పూర్తిగా బడిని మూసేయాల్సి వస్తోంది. ఈ సమయంలో ఎంఈవోకు సమాచారం ఇస్తే పక్క పాఠశాల ఉపాధ్యాయుడు, లేదా సీఆర్పీని పంపాలి. కాని చాలాచోట్ల అలా జరగడం లేదు.

మండలంలో 47 పాఠశాలలు..

మండలంలో మొత్తం 77 పాఠశాలలకు 45 బడుల్లో ఒకే టీచర్ పనిచేస్తున్నారు. కిష్టాపూర్, గోండ్ లఖంపూర్, వడూర్, శంకరాపూర్, కుప్టి, కుమారి, తేజాపూర్ కాలనీ, వెంకటాపూర్, నాగమల్యాల్, ఆరెపల్లి, కొర్టికల్, మథురతాండ, బోరిగాం, బంధం, వాంకిడి, రాజుర, ఇస్పూర్, నారాయణపూర్ తదితర పాఠశాలల్లో ఎక్కువ సంఖ్యలో విద్యార్థులు ఉన్నా ఒకే ఉపాధ్యాయుడు పాఠాలు బోధించాల్సి వస్తోంది. ఇతర పాఠశాలల నుంచి సర్దుబాటు చేస్తామనుకున్నా అక్కడ కొరత ఉంది. దీంతో విద్యార్థులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

వీవీ నియమించాలి



ఉపాధ్యాయ బదిలీ, పదోన్నతులు కోర్టు పరిధిలో ఉండడంతో నూతన నియామకానికి ఆటంకంగా మారింది. బడుల్లో ఉత్తమ బోధన కొనసాగించాలంటే కనీసం విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా విద్యావలంటీర్లనైనా నియమించాలి. – గంగాధర్, పీఆర్టీయూ మండల ప్రధాన కార్యదర్శి, నేరడిగొండ

ఆలయంలో అనిల్‌జాదవ్ పూజలు


కుటుంబ సమేతంగా పూజలు నిర్వహిస్తున్న అనిల్ జాదవ్

నేరడిగొండ: మండలంలోని రాజురా గ్రామంలోని జగదాంబ దేవి–సేవాలాల్ మహరాజ్ ఆలయాన్ని బోథ్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్ మంగళవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో పార్టీ టికెట్ ప్రకటించిన సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం జిల్లా కేంద్రంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్నతోపాటు రాష్ట్ర డెయిరీ మాజీ చైర్మన్ లోక భూమారెడ్డితోపాటు బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావ్‌లను మర్యాదపూర్వకంగా కలిశారు.

అనిల్ జాదవ్ ఇంటి వద్ద సందడి..

బీఆర్ఎస్ బోథ్ ఎమ్మెల్యే అభ్యర్థిగా నేరడిగొండ మండల జెడ్పీటీసీ అనిల్ జాదవ్ పేరు ప్రకటించడంతో ఆయన ఇంటి వద్ద సందడి నెలకొంది. మంగళవారం నియోజకవర్గంలోని పార్టీ కార్యకర్తలతో పాటు వివిధ పార్టీల కార్యకర్తలు, ప్రజలు వచ్చి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛాలు అందజేశారు.

ఎల్బీనగర్ పోలీసులపై చర్యలు తీసుకోవాలి

నార్నూర్: ఎల్బీనగర్ పోలీస్‌స్టేషన్‌లో గిరిజన మహిళను కొట్టి గాయపర్చిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని జైభారత్ ఎస్టీ పోరాట వేదిక జిల్లా అధ్యక్షుడు పెందూర్ దీపక్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తన కూతురు పెళ్లి కోసం అన్న వద్దకు వెళ్లి డబ్బు తీసుకువస్తుండగా లక్ష్మిని పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారన్నారు. అక్కడ ఆమెను కొట్టి హింసించినవారిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలన్నారు. బాధిత కుటుంబానికి హోంమంత్రి బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బాధితురాలి వైద్య ఖర్చులను ప్రభుత్వం భరించి రూ.10 లక్షలు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు రాయల్‌ఖాన్, గంగారాం, నేతాజీ, మెస్రం చిత్రు, చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పెందూర్ దీపక్

క్లుప్తంగా

నోటుబుక్‌ల పంపిణీ


నోటుబుక్స్‌తో విద్యార్థులు

ఎదులాపురం: పట్టణంలో భవిత కేంద్రం (ప్రత్యేక అవసరాలు గల పిల్లలు)లో దివ్యాంగ విద్యార్థులకు డీఈవో ప్రణీత, రణదీవెనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం భూపతిరెడ్డి మంగళవారం నోటుబుక్‌లు పంపిణీ చేశారు. భవిత కేంద్రం ప్రత్యేక ఉపాధ్యాయులు పుష్పవేణి, రాజన్న, నరేశ్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ


ప్రవీణ్

సిరికొండ: నూతన తహసీల్దార్‌గా ప్రవీణ్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన సుభాష్‌చంద్ర బదిలీపై వెళ్లారు. డిప్యూటీ తహసీల్దార్ శంకర్ ఇన్‌చార్జి తహసీల్దార్‌గా వ్యవహరించారు. కాగా, నిర్మల్ జిల్లా నుంచి ప్రవీణ్ బదిలీపై ఇక్కడికి వచ్చి బాధ్యతలు చేపట్టారు.

ముక్తాపూర్‌ను జైనథ్ మండలంలో చేర్చాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

జైనథ్: సాత్నాల మండలం అడ పంచాయతీ పరిధిలోని ముక్తాపూర్ గ్రామాన్ని జైనథ్ మండలంలో చేర్చాలని గ్రామస్తులు కోరారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ శ్యాంసుందర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముక్తాపూర్‌కు జైనథ్ 4 కి.మీ, అదే సాత్నాల మండలానికి సుమారు 20 కి.మీ దూరం ఉంటుందన్నారు. జైనథ్ మండలంలోనే ముక్తాపూర్ చేర్చేలా చూడాలని అధికారులను కోరారు. గ్రామస్తులు అనిల్, లింగన్న, కేశవ్, సంతోష్, సాగర్ తదితరులు ఉన్నారు.

బీజేపీతోనే అభివృద్ధి


కరపత్రాలు అందజేస్తున్న పార్టీ నాయకులు

జైనథ్: బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ అన్నారు. సందీప్ దుర్వే అధ్యక్షతన ప్రవాస్ యోజన కార్యక్రమంలో భాగంగా మంగళవారం పార్టీ కార్యకర్తలతో కలిసి మండలంలోని బాలాపూర్ గ్రామంలో పర్యటించారు. ప్రధాని మోదీ అందిస్తున్న సుపరిపాలన గురించి గ్రామస్తులకు వివరించారు. ఈ సందర్భంగా సంక్షేమ పథకాల కరపత్రాలు పంపిణీ చేశారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళా సాధికారతపై అవగాహన


మాట్లాడుతున్న యశోద

బేల: మండల కేంద్రంలోని కీర్తన డిగ్రీ కళాశాలలో మంగళవారం మహిళా సాధికారతపై అవగాహన సదస్సు నిర్వహించారు. మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు, సైబర్ నేరాల గురించి జిల్లా ఇన్‌చార్జి యశోద వివరించారు. చట్టాలు, హక్కులపై అవగాహన పెంచుకుని వినియోగించుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ వరప్రసాద్‌రావు, షీ టీం ఇన్‌చార్జి సునీత, మహిళా అధ్యాపకులు పుష్ప, బిందు, సౌందర్య, విద్యార్థులు పాల్గొన్నారు.

శబరిమాత ఆలయంలో పూజలు

తలమడుగు: మండలంలోని దేవాపూర్‌లోని శబరిమాత ఆలయంలో అఖండ జ్యోతి కార్యక్రమంలో భాగంగా మంగళవారం సుంకిడి గ్రామస్తులు పూజలు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు భజన కార్యక్రమం నిర్వహించారు. బరంపూర్,ఝరి, తలమడుగు, కొత్తూరు, ఖోడద్, గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చారు. వారి కోసం అన్నదానం నిర్వహించారు. ఆలయంలో అఖండ జ్యోతి కార్యక్రమం నెల రోజుల పాటు నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. సర్పంచ్ అబ్దుల్లా, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో పేరు చూసుకోవాలి

- ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్

బోథ్: ఓటరు జాబితాలో పేరు చూసుకోవాలని ఐటీడీఏ పీవో, నియోజకవర్గ ఎన్నికల అధికారి చాహత్ బాజ్‌పాయ్ పేర్కొన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఆమె వివిధ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటరు జాబితా ప్రచురించామన్నారు. జాబితాలో ఓటర్లు తమ పేర్లను సరి చూసుకోవాలన్నారు. అక్టోబర్ 1 నాటికి 18 ఏళ్లనిండిన వారు సెప్టెంబర్ 19లోగా ఓటరుగా నమోదుకు అవకాశం ఉందన్నారు. అధికారులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

బేల: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని పోలింగ్‌బూత్ నం. 68, 70, 71లలో తుది ఓటరు జాబితాను బేల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గీత, బీఎల్‌వోలతో గోడలపై ప్రదర్శించారు. జూనియర్ అసిస్టెంట్ అరవింద్, బీఎల్‌వోలు జయేష్, బబన్, తదితరులు పాల్గొన్నారు.


పార్టీల నాయకులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్

సిరికొండ: తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం బీఎల్వోలతో తహసీల్దార్ ప్రవీణ్ సమావేశం నిర్వహించారు. ఓటరు జాబితాలో తప్పులుంటే సవరించాలన్నారు. డిప్యూటీ తహసీల్దార్ శంకర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ విలాస్ ఉన్నారు.

డివిజన్ ఏర్పాటు కాకుంటే ఎన్నికలు బహిష్కరిస్తాం

బోథ్: డివిజన్ ఏర్పాటు చేయకపోతే రానున్న ఎన్నికలు బహిష్కరిస్తామని బోథ్ డివిజన్ సాధన సమితి సభ్యులు పేర్కొన్నారు. బోథ్‌కు వచ్చిన ఐటీడీవో పీవో చాహత్ బాజ్‌పాయ్‌కు మంగళవారం వినతిపత్రం అందించారు. డివిజన్‌తోపాటు 31 అంశాలను ప్రభుత్వం పరిగణలోకి తీసుకోవాలని కోరారు. అసెంబ్లీ ఎన్నికలతోపాటు, ఏ ఎన్నికల వచ్చినా మండల వాసులు ఎన్నికలకు దూరంగా ఉంటారని తెలిపారు.


ఐటీడీవో పీవోకు వినతిపత్రం ఇస్తున్న డివిజన్ సాధన సమితి సభ్యులు

నేడు అండర్-14 బాలికల కబడ్డీ ఎంపిక పోటీలు

ఆదిలాబాద్/ఇచ్చోడ: ఇచ్చోడలోని బాలికల ఆశ్రమ పాఠశాలలో బుధవారం ఎస్జీఎఫ్ జిల్లా స్థాయి అండర్–14 కబడ్డీ బాలికల ఎంపిక పోటీలు ఉంటాయని ఆర్గనైజింగ్ సెక్రటరీ కాంతారావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనేవారు 2010 జనవరి 1 తర్వాత జన్మించి, 48 కిలోల బరువును కలిగి, 8 తరగతిలోపు చదువుతున్న బాలికలు అర్హులని పేర్కొన్నారు. పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు వయసు ధ్రువీకరణ పత్రం, బోనాఫైడ్ సర్టిఫికెట్‌తో ఉదయం 10 గంటలకు పోటీలకు కన్వీనర్ హెచ్‌ఎం ఉత్తమ్ దాస్, పోటీల ఆర్గనైజర్ రాథోడ్ గోపాల్‌కు రిపోర్ట్ చేయాలని సూచించారు. ప్రతీ పాఠశాల నుంచి ఇద్దరు చొప్పున పోటీల్లో పాల్గొనేలా చూడాలని వ్యాయామ ఉపాధ్యాయులకు సూచించారు.

రేపు టార్గెట్ బాల్ ఎంపిక పోటీలు

ఆదిలాబాద్: జైనథ్ మండలం పిప్పర్ వాడలోని అభ్యుదయ పాఠశాలలో గురువారం ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి అండర్–17, 19 బాల, బాలికలకు టార్గెట్ బాల్ ఎంపిక పోటీలు ఉంటాయని ఆర్గనైజింగ్ సెక్రటరీ కాంతారావు ఓ ప్రకటనలో తెలిపారు. అర్హత ఉన్న క్రీడాకారులు వయసు ధ్రువీకరణ పత్రం, బోనాఫైడ్ పత్రాలతో పోటీల కన్వీనర్ రమణకు ఉదయం 10 గంటలకు రిపోర్ట్ చేయాలని సూచించారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన

నేరడిగొండ: డీపీఆర్వో ఆధ్వర్యంలో మండలంలోని మాదాపూర్, లఖంపూర్, రోల్‌మామడ, గుత్పాల గ్రామాల్లో ప్రభుత్వ పథకాలపై కళాకారులు మంగళవారం అవగాహన కల్పించారు. ఓటరు నమోదు, వీవీ ప్యాట్‌ల వినియోగం గురించి తెలియజేశారు. వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పారిశుధ్యం గురించి కళ్లకు కట్టినట్లుగా వివరించారు. తెలంగాణ సాంస్కృతిక సారథి ఆదిలాబాద్ బృందం కళాకారులు చాకటి రవి, గింజల రమేశ్, గట్టు వెంకట్‌రావు, రాజలింగు, గోవిందరావు, శంకర్, మురళి, ఆశిష్, నగేష్, నర్సమ్మ, దుర్గత తదితరులు పాల్గొన్నారు.


గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న కళాకారులు

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

ఎదులాపురం: హక్కులు, చట్టాలపై మహిళలు, యువతి అవగాహన పెంపొందించుకోవాలని సఖీ కేంద్రం కౌన్సెలర్లు లావణ్య, నాగమణి, శుకేష్న అన్నారు. జిల్లా కేంద్రంలోని నలందా కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దిశ కేసును ఉదాహరణగా చెప్పారు. దిశ ఒక డాక్టర్, విద్యావేత్త ఆమె వద్ద ఫోన్ ఉంది. అత్యవసర వేళ తన చెల్లికి ఫోన్‌చేసి అరగంట మాట్లాడింది. ఆమె చెల్లితో కాకుండా హెల్ప్‌లైన్ 100, 181, 112 సంప్రదించి ఉంటే చనిపోయి ఉండేది కాదని ఉదహరించారు. మహిళల కోసం అనేక చట్టాలు, హెల్ప్‌లైన్‌లు ఉన్నాయని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కళాశాల ప్రిన్సిపాల్ పున్నారావు, వైస్ ప్రిన్సిపాల్ విజయ్‌గోపాల్, ఎన్ఎస్ఎస్ అధికారి గాలి అశోక్, విద్యార్థినులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న సఖీ కేంద్రం కౌన్సెలర్లు

'లక్ష'ణంగా వదిలేసి




కైలాస్‌నగర్: ఆదిలాబాద్‌కు నలుదిక్కుల ఉన్నటువంటి ప్రవేశమార్గాల్లో స్వాగతం, ధన్యవాదాలు తెలిపేలా మున్సిపల్ కౌన్సిల్ ఆధ్వర్యంలో స్వాగత తోరణాలు ఏర్పాటు చేస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా రాంపూర్ వార్డు సమీపంలో ఏర్పాటు చేసేందుకు తీసుకొచ్చిన స్వాగత తోరణ బోర్డు, స్తంభాన్ని రోడ్డు పక్కన పడేశారు. లక్షలాది రూపాయలు వెచ్చించి కొనుగోలు చేసిన వీటిని నెలల తరబడి పడేసి ఉంచడంతో ప్రజాధనం దుర్వినియోగమవుతోంది. వర్షాలకు అవి తడుస్తుండటంతో పాడయ్యే ప్రమాదం లేకపోలేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- గడ్చిరోలి జిల్లా ఆర్మూరి ఎమ్మెల్యే కృష్ణ గజ్బే

నేరడిగొండ: కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా ఆర్మూరి ఎమ్మెల్యే కృష్ణ గజ్బే సూచించారు. అసెంబ్లీ ప్రవాస్ యోజనలో భాగంగా మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పార్టీ కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు సోనయ్య హీరాసింగ్, మండల ప్రధాన కార్యదర్శి సాబ్లే సంతోష్ సింగ్, పోలింగ్ బూత్ అధ్యక్షులు, శక్తి కేంద్రం ఇన్‌చార్జీలు, జిల్లా, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆర్మూరి ఎమ్మెల్యే కృష్ణ గజ్బే

ప్రజా సేవ చేయడం అభినందనీయం

జైనథ్: ప్రజా సమస్యలను పరిష్కరించేలా సేవ కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని మహారాష్ట్రలోని కేళాపూర్ అర్ణీ బీజేపీ ఎమ్మెల్యే సందీప్ దుర్వే అన్నారు. జైనథ్, బేల మండల ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని పాయల్ శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబులెన్సు సర్వీసులను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ మాట్లాడుతూ తరోడా బ్రిడ్జి కుంగిపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రజా సమస్యలను ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న పట్టించుకోవడం లేదని విమర్శించారు. ప్రజలకు ఏ ఆపద ఉన్నా పాయల్ శంకర్ ఫౌండేషన్ ముందు వరుసలో ఉంటుందని భరోసా కల్పించారు. ప్రవీణ్‌రెడ్డి, సుహాసిని, రమేశ్, రాందాస్, ముకుంద్, కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.


అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న కేళాపూర్ అర్ణీ ఎమ్మెల్యే సందీప్ దుర్వే

'పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉంటాం'

ఉట్నూర్‌రూరల్: బీఆర్ఎస్ అధ్యక్షుడు, సీఎం కేసీఆర్ తీసుకున్న నిర్ణయానికి కట్టుబడి ఉంటామని ఎంపీపీ పంద్ర జైవంత్‌రావు, పార్టీ మండల అధ్యక్షుడు కందుకూరి రమేష్ అన్నారు. స్థానిక ప్రెస్‌భవన్‌లో మంగళవారం వారు విలేకరులతో మాట్లాడారు. ఖానాపూర్ నియోజకవర్గ అభ్యర్థి జాన్సన్ నాయక్ గెలుపు కోసం కృషి చేస్తామన్నారు. ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ సైతం పార్టీ వీడొద్దని కోరారు. బీఆర్ఎస్ నాయకులు ఎవరైన పార్టీకి వ్యతిరేకంగా వ్యవహరిస్తే చర్యలు ఉంటాయన్నారు. ఏళ్లుగా పార్టీల్లో ఉన్న కార్యకర్తలు, నాయకులకు రాబోయే రోజుల్లో ప్రాధాన్యత ఉంటుందన్నారు. సమావేశంలో సింగిల్ విండో చైర్మన్ ఎస్పీరెడ్డి తోపాటు కోఆప్షన్ సభ్యుడు రషీద్, నాయకులు ప్రభాకర్, రమేష్, ముజీబ్‌ఖాన్, బాదిరావు, భరత్, ఆశన్న, నందకుమార్, అన్సారి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీపీ జైవంత్‌రావు

జగదాంబ ఆలయంలో పూజలు

ఉట్నూర్‌రూరల్: మండలంలోని జైత్రాంతండాలో జగదాంబ ఆలయంలో బీజేపీ నాయకుడు, మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సాకెర(కె) గ్రామంలోని మతుర తండాలో ప్రజలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రం ప్రవేశపెడుతున్న పథకాల గురించి వివరించారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిని ఆదరించాలని కోరారు. జిల్లా కార్యదర్శి కొండేరి రమేశ్, మండల అధ్యక్షుడు కొలిపాక రాజశేఖర్, కొమ్ము రాచందర్, కల్వ రవి, బొడ్డు కిరణ్, భూపతి, శేషరావు, కిషన్, విఠల్ పాల్గొన్నారు.


పూజల్లో పాల్గొన్న రాథోడ్ రమేశ్

సంక్షిప్త వార్తలు

సన్మానం

తాంసి: సీఆర్పీఎఫ్ కానిస్టేబుల్‌గా ఎంపికైన కప్పర్ల గ్రామానికి చెందిన అజయ్‌ని జీపీ వద్ద గ్రామస్తులు మంగళవారం సన్మానించి అభినందించారు. సర్పంచ్ సదానంద్, ఎంపీటీసీ సంతోష్, మార్కెట్ డైరెక్టర్ మహేందర్, ఉప సర్పంచ్ రాజు, గ్రామపెద్దలు ప్రకాశ్, శేఖర్ తదితరులు ఉన్నారు.

'మైనార్టీలకు సీటు కేటాయించాలి'

ఇచ్చోడ: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఒక్క నియోజకవర్గంలోనైన మైనార్టీలకు సీటు కేటాయించాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో పార్టీ కార్యాలయంలో మంగళవారం వారు విలేకరులతో మాట్లాడారు. ఆదిలాబాద్ నియోజకవర్గంలో కరోనా సంక్షోభంలో జిల్లా అధ్యక్షుడు సాజిద్‌ఖాన్ ఎన్నో సేవలందించారని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో సాజిద్‌ఖాన్‌కు అవకాశం ఇవ్వాలని కోరారు. ఇచ్చోడ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహిముద్‌ఖాన్, మండల పార్టీ అధ్యక్షుడు నారాయణ్‌రెడ్డి, మైనార్టీ సెల్ చైర్మన్ ముస్తాఫా, యూత్ అధ్యక్షుడు నౌషాద్ పాల్గొన్నారు.

'గులాబీ పురుగు'కు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

బేల: పత్తిచేన్లలో గులాబీ పురుగు దశను రైతులు గమనించి సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏవో వెండి విశ్వామిత్ర పేర్కొన్నారు. మండలంలోని పాటన్ రెవెన్యూ గ్రామ శివారులోని పత్తి చేన్లను మంగళవారం పరిశీలించారు. ఏఈవోలు నగేష్, రాజు, సాయి జావేద్ తదితరులు ఉన్నారు.

గర్భిణులకు వైద్యపరీక్షలు

తాంసి: భీంపూర్ మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో 32 మంది గర్భిణులకు మంగళవారం వైద్యపరీక్షలు నిర్వహించారు. వైద్యాధికారి నిఖిల్‌రాజ్ వారికి బీపీ, షుగర్, రక్తపరీక్షలు చేశారు. హెచ్‌ఈవో జ్ఞానేశ్వర్, సూపర్‌వైజర్ గంగాధర్, హెల్త్ అసిస్టెంట్ విష్ణు తదితరులు ఉన్నారు.

'జర్నలిస్టులకు కేసీఆర్ క్షమాపణ చెప్పాలి'

ఎదులాపురం: కుల పత్రికల్లో పనిచేస్తున్న విలేకరులకు ఇళ్ల స్థలాలు ఇవ్వనని సీఎం కేసీఆర్ చేసిన వ్యాఖ్యలను సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా జిల్లా ప్రధాన కార్యదర్శి జగన్‌సింగ్ ఓ ప్రకటనలో ఖండించారు. జర్నలిస్టులకు కేసీఆర్ వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్‌చేశారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

నేరడిగొండ: ఎంపీడీవో సమావేశ మందిరంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ రాథోడ్ సజన్ అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో అబ్దుల్ సమద్ ఓ ప్రకటనలో తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

నేరడిగొండ: మండల కేంద్రానికి చెందిన మహావీర్ సింగ్‌కు మంజూరైన రూ.25 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును బీఆర్ఎస్ మండల కన్వీనర్ అల్లూరి శివారెడ్డి మంగళవారం అందజేశారు. మండల ఉపాధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, తర్నం సర్పంచ్ విశాల్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో 'గృహలక్ష్మి' దరఖాస్తుల నమోదు

బోథ్: గృహలక్ష్మికి దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు ఆన్‌లైన్ ప్రక్రియ కొనసాగుతోంది. మండల వ్యాప్తంగా 4,375 మంది పథకానికి దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 3869 మందిని అర్హులుగా గుర్తించారు. కాగా బుధవారం నాటికి 2641 మంది దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేశామని ఎంపీడీవో సుణీల్‌రెడ్డి తెలిపారు.